క్లుప్తంగా

లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం చెక్కుల పంపిణీ



బాన్సువాడ : బాన్సువాడ నియోజకవర్గ పరిధిలోని నస్రుల్లాబాద్ మండలానికి చెందిన డబుల్ బెడ్రూం ఇళ్ల బిల్లుల చెక్కులను ఆదివారం లబ్ధిదారులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆయన ఇంటి వద్ద పంపిణీ చేశారు. నస్రుల్లాబాద్ గ్రామానికి చెందిన 40 మందికి రూ.76.53లక్షలు, దుర్కిలో 60 మందికి రూ. 26.08లక్షలు, నెమ్లిలో 15 మందికి రూ.15.11లక్షలు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో ఉన్న పెండింగ్ బిల్లులు పూర్తిగా అందేలా చూస్తామన్నారు. అనంతరం నస్రుల్లాబాద్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పాల్త్య విఠల్, మాజీ ఏఎంసి చైర్మన్ పెర్క శ్రీనివాస్, నాయకులు కంది మల్లేష్, మైసాగౌడ్, ఖలీల్, మాజీద్ ఖాన్, రతన్, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



రాజంపేట : మహిళ సంఘ సభ్యులు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని రాజంపేట ఐకేపీ సీసీ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రాజంపేట గ్రామ సంఘ అధ్యక్షురాలు లలిత అధ్యక్షతన సమాఖ్య సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామ సంఘాల పరిధిలో గల చిన్న సంఘాలు సక్రమంగా సమావేశాలు నిర్వహించి పుస్తక నిర్వహణ చేసుకోవాలని, సంఘం నుంచి తీసుకునే ప్రతి అప్పు కూడా ఆదాయ అభివృద్ధికి వినియోగించాలని సూచించారు. సంఘ సభ్యులకు టైలరింగ్ శిక్షణ కార్యక్రమం, ఆసక్తి గల మహిళా సభ్యులు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. నూతన సభ్యులను సంఘాలలో చేర్పించడం, న్యూ ఎంటర్ప్రైజెస్ పెరటి కోళ్ల పెంపకం చేపల పెంపకం గేదెల కొనుగోలు గురించి సమావేశంలో చర్చించారు. రాజీవ్ యువ వికాసం కింద అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీవోఏ అన్నపూర్ణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మైనారిటీ సెల్ గ్రామ కమిటీ ఎన్నిక



లింగంపేట(ఎల్లారెడ్డి): కాంగ్రెస్ మైనారిటీ సెల్ మోతె గ్రామకమిటీని ఆదివారం ఎన్నుకున్నట్లు మండల మైనారిటీ అధ్యక్షుడు అఫ్రోజ్ తెలిపారు. మోతె మైనార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడుగా షేక్ అలీ, ఉపాధ్యక్షుడు సయ్యద్ చాంద్ పాషా, ప్రధాన కార్యదర్శి సయ్యద్ షాదుల్లా, మైనారిటీ యూత్ అధ్యక్షుడుగా సయ్యద్ హారీఫ్, ఉపాధ్యక్షుడు మహమ్మద్ ఇసాక్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ బాబు మియాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షుడు వంజరి శంకర్రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైనారిటీ సెల్ రఫియోద్దీన్, సంతోష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, సిడిసి డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఏదుల్, అర్షద్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

బోరు డ్రిల్లింగ్ పనులు ప్రారంభం

కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ గ్రామంలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొందని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన ఆయన వెంటనే మున్సిపల్ నిధులతో ఆదివారం లింగాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బోర్ వేయించారు. ఈ సందర్భంగా బోరు మంజూరు చేయించినందుకు గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కాసర్ల శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్, భూపాల్, జైపాల్, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన కానిస్టేబుళ్లకు సన్మానం

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఇద్దరు కానిస్టేబుళ్లు బదిలీపై వెళ్లినట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. లింగంపేట నుంచి రాజయ్య కరీంనగర్ జిల్లాకు బదిలీ కాగా శంకర్ సైబరాబాదుకు బదిలీ అయినట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్ బదిలీపై వెళ్తున్న ఇద్దరిని శాలువాలు కప్పి సన్మానించారు. ఏఎస్సై ప్రకాష్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీలో పనులు ఎన్నో...

- ఐదారింటితోనే సరిపెట్టుకుంటున్న రైతులు, కూలీలు
- గ్రామాల్లో కొరవడిన అవగాహన
- పట్టించుకోని అధికారులు



ముళ్ల పొదలతో ఉన్న నస్రుల్లాబాద్ శ్మశాన వాటిక



అంకోల్ గ్రామంలో ఫిష్ పాండ్స్ కోసం గుంతలు తవ్వుతున్న ఉపాధి కూలీలు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో రైతులు, కూలీలు ఉపయోగించుకునే పనులు ఎన్నో ఉన్నా అధికారుల నిర్లక్ష్యంతో నామమాత్రపు పనులు చేస్తూ కాలం వెల్లదీస్తున్నారు. రైతులకు ప్రయోజనం చేకూర్చే పనులు దాదాపు 266 రకాలు ఉన్నా కూడా కనీసం పది రకాల పనులు కూడా చేయిస్తాలేరు. 2006లో ప్రారంభమైన ఉపాధిహామీ పనులు ఇప్పటికి దాదాపు 19 ఏళ్లు కావొస్తోంది. ఇప్పటికి ఫిష్ పాండ్స్, ముళ్ల కంచె తొలగింపు, నర్సరీ పనులు, చెట్ల పెంపకం, అటవీ ప్రాంతంలో గుంతలు తీయడం వంటివి మాత్రమే చేయిస్తున్నారు. ప్రస్తుతం యాసంగి పంట చేతికి రావడంతో వ్యవసాయ పనులు లేకపోవడంతో కూలీలు పనులకు ఆసక్తి చూపిస్తున్నారు.

ఉపాధి హామీలో 266 రకాల పనులు..

జిల్లా వ్యాప్తంగా ఉన్న 2,77,487 జాబ్ కార్డు కుటుంబాలలో 5,58,210 కూలీలు ఉన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రైతులకు ప్రయోజనం చేకూర్చే 266 రకాల పనులు ఉన్నాయి. కంపోస్టు ఎరువు గుంత, వ్యవసాయ పొలాల్లోకి రోడ్డు వేసుకోవడం, భూ ఉపరితల నీటి కుంటలు, బావుల తవ్వకం, వర్మి కంపోస్టు పిట్‌లు, కొత్తగా పంట కాల్వల ఏర్పాటు, ఉమ్మడి భూముల్లో పశువుల నీటి కోసం కుంటల నిర్మాణం, పశువులు,జీవాల తాగునీటి తొట్టిల నిర్మాణాలు,ప శువులు,మేకల పాకలు,కోళ్ల ఫారం నిర్మాణాలు,గడ్డి పెంపకం,భూమి సరిహద్దు చుట్టూ కందకాలు తవ్వకాలు, చేపల ఉత్పత్తి కుంటల నిర్మాణాలు, శ్మశాన వాటికల వద్దకు రోడ్డును వేయడం, ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో రహదారుల నిర్మాణం, ఇంకుడు గుంతల ఏర్పాటు, రైతుల పంట పొలాలగట్లపై మొక్కల పెంపకం, తాటి వనాల పెంపకం వంటి పలు రకాల పనులను రైతులు వ్యక్తిగతంగాను, సామూహికంగా చేపట్టి ఈజీఎస్‌లో ప్రయోజనం పొందే అవకాశం ఉంది. ఇకనైనా అధికారులు పూర్తి స్థాయిలో ఎన్ఆర్ఈజీఎస్‌లో చేసుకునే అవకాశం ఉన్న పనులపై రైతులు, కూలీలకు అవగాహన కల్పించాలి.

ఉపాధి పనికి వెళ్తా..



రోజు ఉపాధి హామీ పనికి వెళ్తా. వివిధ రకాల పనులపై అవగాహన కల్పిస్తే వాటిని వినియోగించుకుంటాం. ఎప్పుడు అడవిలో కోపులు తీయడమే పనిగా చేయిస్తారు. సొంత భూమి ఉన్న వారికి ,భూమి లేని వారికి ఉపాధి హామీ పనుల గురించి వివరించాలి.

– గణేశ్, ఉపాధిహామీ కూలి, మైలారం

క్షేత్ర స్థాయి సిబ్బందిని ఆదేశిస్తాం

ప్రతి సంవత్సరం గ్రామ సభలో ఉపాధి పనుల గురించి తీర్మానాలు తీసుకుంటాం. గ్రామంలో అవసరం మేరకు పనులను కేటాయిస్తున్నాం. మండలంలో పలువురు కోళ్ల ఫారాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రజల అవసరాల మేరకు పనులను కల్పిస్తున్నాం. ఎన్ఆర్ఈజీఎస్‌లో ఉన్న పనులను వివరించేలా క్షేత్ర స్థాయిలో సిబ్బందికి ఆదేశిస్తాం.

– సూర్యకాంత్, ఎంపీడీవో, నస్రుల్లాబాద్

దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వాలి

బీబీపేట: ప్రతి సీజన్‌లో పండించే దొడ్డు వడ్లకు సైతం ప్రభుత్వం రూ. 500 బోనస్ ఇవ్వాలని కోరుతూ ఆదివారం మండల బీఆర్ఎస్ నాయకులు ప్రధాన చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రుణమాఫీ పేరుతో రైతులను నిండా మోసం చేసిందని, ఇప్పటికీ కూడా రూ. 2లక్షల రుణమాఫీ చేయలేదన్నారు. ఎలాంటి షరతులు లేకుండా ప్రతి రైతుకు రెండు లక్షల రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఎండలతో పంటలు ఎండిపోయాయని రైతులకు తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని పేర్కొన్నారు.



రోడ్డుపై ధర్నా చేస్తున్న నాయకులు

అనంతరం ధర్నా విరమించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, సొసైటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



ఎల్లారెడ్డి/గాంధారి : అగ్నిమాపక వారోత్సవాలను సోమవారం నుంచి వారం రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఫైర్ ఆఫీసర్ వినోద్ తెలిపారు. పట్టణంలోని ఫైర్‌స్టేషన్‌లో ఆదివారం అగ్నిమాపక వారోత్సవాల వాల్ పోస్టర్లను మున్సిపల్ మాజీ చైర్మన్ పద్మశ్రీకాంత్, ఫైర్ ఆఫీసర్ వినోద్, గాంధారి ఫైర్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు ఆవిష్కరించారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విద్యాసాగర్,నీలకంఠం,ఫైర్ సిబ్బంది ఉన్నారు.

భారత్ విభూషణ్ అవార్డు అందుకున్న గోపాల్‌గౌడ్



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డికి చెందిన చుక్క గోపాల్‌గౌడ్ ఆదివారం భారత్ విభూషణ్ 2025 అవార్డును అందుకున్నారు. ప్రముఖ చిత్రకారుడు చుక్క గోపాల్‌గౌడ్‌కు ముంబాయి సంస్థ నేషనల్ ఆర్టిస్టుగా గుర్తించి అతడికి భారత్ విభూషణ్ అవార్డును ప్రకటించింది. ఈసంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఈఅవార్డును అందుకున్నారు. గోపాల్‌గౌడ్‌కు స్థానికులు అభినందనలు తెలిపారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు



ప్రశంసపత్రాలను అందిస్తున్న కోఆర్డినేటర్ చంద్రకాంత్



దోమకొండలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రోగ్రాం కోర్డినేటర్‌లు

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని హాజీపూర్‌తండాలో గత వారం రోజులుగా నిర్వహించిన ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు ఆదివారంతో ముగిసినట్లు కోఆర్డినేటర్ చంద్రకాంత్ తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు గత వారం రోజులుగా హాజీపూర్‌తండాలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ క్యాంపులో విద్యార్థులు పాఠశాల, గ్రామ పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు వారికి పలు విషయాలపై అవగాహన కల్పించారు. క్యాంపుకు హాజరైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మనం మారుదాం...లోకాన్ని మారుద్దాం

దోమకొండ: మనం మారుదాం..లోకాన్ని మారుద్దాం అని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌లు డాక్టర్ అంజయ్య, డాక్టర్ హరిత, ప్రొఫెసర్ రవీందర్‌లు అన్నారు. ఆదివారం దోమకొండ మండల కేంద్రంలో తెలంగాణ సౌత్ క్యాంపస్ ఆధ్వర్యంలో వేసవికాల ప్రత్యేక శిబిరంలో భాగంగా చివరి రోజున నిర్వహించిన కార్యక్రమాలలో వారు పాల్గొని మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరించారు. అనంతరం గడికోట ట్రస్టు ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత మెడికల్ క్యాంప్‌లో పాల్గొని గ్రామానికి చెందిన వృద్ధులు వికలాంగులకు ట్రస్టు ద్వారా ఉచితంగా మందులను అందజేశారు. వలంటీర్లకు కమ్యూనిటీ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. కెరీర్‌పరంగా సేవా కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. అనంతరం వలంటీర్లకు సర్టిఫికెట్లను అందజేశారు.కార్యక్రమంలో గడికోట ట్రస్టు మేనేజర్ బాబ్జీ, ప్రతినిధులు గణేష్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

రోజు ధ్యానం చేయాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రతిఒక్కరూ ప్రతిరోజు ధ్యానం చేయాలని పిరమిడ్ మాస్టర్ సునీత అన్నారు. తాడ్వాయిలోని శబరిమాత ఆశ్రమంలో ఆదివారం పిరమిడ్ స్పిరిచ్యువల్ ఆదిలాబాద్ సొసైటీ మూమెంట్ ఆధ్వర్యంలో ధ్యాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తమ ఆత్మజ్ఞాన సందేశాన్ని అందించారు. అన్నిశక్తులు మనలో ఉన్నాయని, ఆత్మను మించిన దైవం లేదన్నారు. రోజు ధ్యానం చేయాలని సూచించారు. సాత్విక భోజనం చేయాలని కోరారు. ఈసందర్భంగా భక్తులు ధ్యానం చేశారు. కార్యక్రమంలో కామారెడ్డి, తాడ్వాయి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

33వ వార్డులో 'గావ్ చలో–బస్తీ చలో'



కామారెడ్డి అర్బన్ : పట్టణంలోని 33వ వార్డులో ఆదివారం బీజేపీ నాయకులు 'గావ్ చలో–బస్తీ చలో' కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలను వివరిస్తూ ఇంటింటికీ కరపత్రాలను పంచిపెట్టారు. ఈసందర్భంగా బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి ముదాం రాజగోపాల్ మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నరేందర్‌రెడ్డి, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు విపుల్‌జైన్, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, నాయకులు సంతోష్, వేణు, రాజేష్, భరత్, సాయి, ప్రణయ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం



కామారెడ్డి రూరల్ : మున్సిపల్ పరిధిలోని స్వప్నలోక్ కాలనీలో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ మొదటి వార్షికోత్సవం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు బ్రహ్మశ్రీ గంగవరం ఆంజనేయ శర్మ, యజ్ఞం సంపత్ కుమార్ శర్మ , అర్చకులు సతీష్ పాండే, అజయ్ పాండే, సాయికుమార్ శర్మ, ఆధ్వర్యంలో ఆలయంలో విశేష పూజలు యజ్ఞ హోమం ,పూర్ణాహుతి, పంచామృత అభిషేకాలు సుహాసినులచే కలశలతో కుంకుమ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌పీఆర్ పాఠశాల కరస్పాండెంట్ మారుతి, ఆలయ కమిటీ అధ్యక్షుడు పవన్ కుమార్ శర్మ, కాలనీ అధ్యక్షుడు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు రమాశంకర్, కోశాధికారి సతీష్, సభ్యులు డాక్టర్ హరీష్, నవీన్, అరవింద్, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైల్వే మండపంలో వైదిక యజ్ఞం



కామారెడ్డి అర్బన్: శ్రీసీతారామ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక రైల్వే మండపంలో జై హన్‌మాన్ యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఆరోగ్య వైదిక యజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యోగాచార్యులు జి.అంజయ్యగుప్తా, సహ యోగాచార్యులు యెల్లంకి సుదర్శన్, ప్రతినిధులు అర్వపల్లి రమేష్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, స్టేషన్ మాస్టర్ సత్యం, పాత రమేష్, రైల్వే ఎస్ఐ మల్లేశ్వరయ్య, పబ్బ జగన్నాథం, విశ్వనాథం పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతం

కామారెడ్డి అర్బన్ : శ్రీరామ్‌లల్లా రామ్‌ధారి అఖాడ కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా కలెక్టరేట్ సమీపంలోని వైఎస్ కాలనీలోని శ్రీరామ్‌లల్లా ఆలయంలో సామూహిక శ్రీసత్యనారాయణ వ్రతం నిర్వహించారు. దాదాపు 300 మంది భక్తులు వ్రతంలో పాల్గొన్నారు. స్థానిక పీఠాధిపతి వేదయోగి మహారాజ్, కార్యదర్శి సుజిత్‌కుమార్, ప్రతినిధులు నాగభూషణం, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో రథయాత్ర



బాన్సువాడ : బీర్కూర్ మండల కేంద్రంలో ఆదివారం గజ్జలమ్మ జాతరలో భాగంగా రథయాత్ర నిర్వహించారు. మూడు రోజుల పాటు సాగే ఈ జాతరలో రెండవ రోజు గజ్జలమ్మ ఆలయం చుట్టూ ఎడ్ల బండ్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వీరేశం,యామ రాములు, రఘు, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

నేడు పార్వతి, పరమేశ్వరుల కళ్యాణం



నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని చంద్రమౌళీశ్వర ఆలయం వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆలయంలో వేదపండితుడు సంజీవ్‌రావ్‌శర్మ దంపతులు అభిషేక పూజలు, అర్చనలు జరిపారు. సోమవారం పార్వతి, పరమేశ్వర కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అన్నప్రసాద కార్యక్రమం నిర్వహిస్తున్నమన్నారు.

హోరాహోరీగా కుస్తీ పోటీలు



లింగంపల్లి హనుమాన్ ఆలయం వద్ద పోటీలను తిలకిస్తున్న గ్రామస్తులు

లింగంపేట/పిట్లం : హనుమాన్ జయంతి సందర్భంగా పలు హనుమాన్ ఆలయాల వద్ద ఆదివారం కుస్తీపోటీలు హోరాహోరీగా జరిగాయి. లింగంపేట మండలం లింగంపల్లి(ఖుర్దు) గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద, పిట్లం మండలం గౌరారం గ్రామంలో గ్రామ కమిటీల ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా టెంకాయ కుస్తీ నుంచి మూడు తులాల వెండి కడెం వరకు పోటీలు నిర్వహించగా, మూడు తులాల కడెం గెలుపొందిన విజేతకు బహూకరించారు. గౌరారం గ్రామంలో రూ. 10 నుంచి మూడు వేల వరకు కుస్తీ పోటీలను నిర్వహించగా గెలుపొందిన విజేతకు నగదు అందజేశారు.అలాగే పిట్లం మండలం తిమ్మనగర్, బ్రాహ్మణపల్లి గ్రామాలలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలను నిర్వహించారు.



గౌరారంలో తలపడుతున్న మల్లయోధులు

సలాబత్‌పూర్‌లో కుస్తీ పోటీలు రద్దు

మద్నూర్(జుక్కల్): మండలంలోని సలాబత్ పూర్ హనుమాన్ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో ఆదివారం నిర్వహించాల్సిన కుస్తీ పోటీలు రద్దు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాంపటేల్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గతేడాది హనుమాన్ జయంతి మరుసటి రోజున నిర్వహించిన కుస్తీ పోటీల్లో గొడవలు కావడంతో ఈసారి కుస్తీ పోటీలను నిర్వహించడం లేదని ఆయన చెప్పారు.

ఘనంగా మత్తడి పోచమ్మ ఉత్సవాలు

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలం బూర్గుల్ గ్రామంలో ఆదివారం మత్తడి పోచమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ట్రాక్టర్లను అందంగా ముస్తాబు చేసి అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేపట్టారు.

నేడు కుస్తీ పోటీలు

మహమ్మద్ నగర్ మండలం బూర్గుల్ గ్రామంలో సోమవారం మల్లయోధుల కుస్తీ పోటీలు నిర్వహి స్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మల్లయోధులు కుస్తీ పోటీలకు తరలి వచ్చి జయప్రదం చేయాలని గ్రామస్తులు కోరారు.



బూర్గుల్‌లో మత్తడి పోచమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న గ్రామస్తులు

సంక్షిప్తం

ఎన్‌యూజే(ఐ) జాతీయ ఉపాధ్యక్షులుగా రాజేందర్‌నాథ్



ఎల్లారెడ్డిరూరల్: నేషనల్ జర్నలిస్టు యూనియన్(ఐ) జాతీయ ఉపాధ్యక్షులుగా రాజేందర్‌నాథ్ ఎన్నికైనట్లు జర్నలిస్టు సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ సమావేశంలో రాజేందర్‌నాథ్‌ను ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. జాతీయ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన రాజేందర్‌నాథ్‌ను హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ సన్మానించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తాడ్వాయి: మండలంలోని సంగోజీవాడి గ్రామంలో ఆదివారం సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు జూకంటి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రూ.10 లక్షలతో పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, డైరెక్టర్ హనుమండ్లు, నాయకులు గైని శివాజీ, మమత, అఖిల్ రావు, మేకల రాజు, సుధాకర్‌రావు, ఫారుక్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



పెద్దకొడప్‌గల్(జుక్కల్): నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగపడుతుందని మండల కాంగ్రెస్ నాయకులు చిప్ప మోహన్ తెలిపారు. ఆదివారం మండలంలోని రతన్‌సింగ్ తండాకు చెందిన రాహుల్‌కు రూ. 45 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆయన అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పండరి, సంజీవ్, రాములు నాయక్ పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు బీఆర్ఎస్ శ్రేణులు తరలి రావాలి

బాన్సువాడ : వరంగల్‌లోని ఎల్కతుర్తిలో ఈనెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు శ్రేణులు భారీగా తరలి రావాలని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్ అన్నారు. బాన్సువాడలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 16నెలలు గడుస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో మోచి గణేష్, సాయి బాబా, అఫ్రోజ్, టేకుర్ల సాయిలు,గంగారాం,తజయ్, రజాక్, గోపాల్, సంజీవ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని గ్రామాల్లో అంబేద్కర్ జయంతి నిర్వహించాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అంబేద్కర్ జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సోమవారం ఘనంగా నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ...జిల్లా వ్యాప్తంగా ఉన్న నాలుగు నియోజకవర్గాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించాలని సూచించారు. అన్ని మండలాల కమిటీల ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించాలన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కామారెడ్డి & ఎల్లారెడ్డి
96034 62494
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
బాన్సువాడ: యం. మధుసూధన్ : 9951027699
ఎల్లారెడ్డి: ఎం. శ్రీనివాస్ : 9704490298
కామారెడ్డి : కె. రాజు : 9949699861
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899